

ఎచ్చెర్ల ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా మురళీకృష్ణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎచ్చెర్ల నియోజకవర్గం ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా కొవ్వాడ ఉప కలెక్టర్ పి.మురళీకృష్ణను నియమిస్తూ కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం రణస్థలం తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ తహశీల్దార్లతో సమావేశం ఏర్పాటు చేసి, ఈనెల 25న నిర్వహించనున్న జాతీయ ఓటర్ల దినోత్సవంపై చర్చించారు. సమావేశానంతరం కొవ్వాడ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. సమావేశంలో తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



పండగ కిక్కు

- సంక్రాంతి పేరుతో ఏరులై పారిన మద్యం
- ఐదు రోజుల్లో రూ.38.24 కోట్ల ఆదాయం
- గతేడాదితో పోలిస్తే రూ.3.8 కోట్లు పెరుగుదల
- అమ్మకాల పెరుగుదలకు బెల్టు షాపులే కారణమా?

జిల్లాలో సంక్రాంతి పండగ వేళ మద్యం ఏరులై పారింది. పండగ రోజుల్లో ఈ ఏడాది రికార్డుస్థాయిలో మద్యం అమ్మకాలు సాగాయి. పండగ రోజుల్లో మందుబాబులు తెగ తాగారు. ఈనెల 13 నుంచి ఐదు రోజుల పాటు సాగిన విక్రయాలతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. గతేడాదితో పోలిస్తే రూ.3.8 కోట్లు అదనంగా ప్రభుత్వ ఖజానాకు చేరింది. బెల్టు షాపులు లేవని ప్రభుత్వం చెప్తున్నా, ప్రభుత్వానికి ఈ ఏడాది ఆదాయం పెరగడంలో వాటి పాత్రే కీలకమన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో మొత్తం 186 మద్యం దుకాణాలు నడుస్తున్నాయి. సంక్రాంతి పండగ కావడంతో ఈనెల 13వ తేదీ నుంచే మద్యం విక్రయాలు ఊపందుకున్నాయి. 17వ తేదీ వరకు మద్యం అమ్మకాల జోరు కొనసాగింది. ఐదు రోజుల్లో మొత్తం రూ.38.24 కోట్ల మేర అమ్మకాలు సాగినట్లు ఎక్సైజ్‌శాఖ అధికారులు చెప్తున్నారు. గతేడాది ఇదే సమయానికి రూ.34.44 కోట్ల అమ్మకాలు సాగాయి. అంటే ఆదాయం రూ.3.8 కోట్ల మేర పెరిగింది. ఐదు రోజుల్లో ఈనెల 15వ తేదీన అత్యధికంగా రూ.8.74 కోట్ల మేర ఆదాయం సమకూరింది.

మద్యం అమ్మకాలు పరిశీలిస్తే ఈనెల 13న 3,28,172 బాటిళ్ల లిక్కర్, 19,954 బాటిళ్ల బీరు అమ్మకాలు సాగాయి. 14న 3,99,913 బాటిళ్ల లిక్కర్, 34,946 బాటిళ్ల బీరు అమ్మారు. 15వ తేదీన లిక్కరు 3,95,392 సీసాలు, 40,022 సీసాల బీరు విక్రయించారు. 16వ తేదీన 4,07,860 బాటిళ్ల లిక్కరు, 57,404 బాటిళ్ల బీరు అమ్మారు. 17వ తేదీన 3,65,673 సీసాల లిక్కరు, 48,152 బాటిళ్ల బీరు విక్రయించారు.

బెల్టు షాపులే కారణమా?

మద్యం ధరల విషయంలో 2022తో పోలిస్తే ఒకట్రెండు బ్రాండ్లు మినహా ప్రస్తుతం సంవత్సరంలో పెద్దగా రేట్లు ఏమీ పెరగలేదు. దుకాణాల సంఖ్యలోనూ పెద్దగా పెరుగుదల లేదు. గతేడాది 177 దుకాణాలు ఉంటే ప్రస్తుతం 186 షాపులు ఉన్నాయి. మద్యం అమ్మకాల ద్వారా ఆదాయం పెరగడం వెనుక బెల్టు షాపులే కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బెల్టు షాపులు ఎక్కడా లేవని ప్రభుత్వం చెప్తున్నా, ఈ సంవత్సరం గణనీయంగా ఆదాయం పెరడానికి అవే దోహదపడ్డాయనే చర్చ నడుస్తోంది. బెల్టు షాపులపై చూసీచూడనట్లు వ్యవహరించాలని అంతర్గతంగా మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. మద్యం నిల్వలు భారీగా పట్టుబడితే తప్ప కేసులు పెట్టవద్దని సూచించినట్లు సమాచారం. దీంతో యథేచ్ఛగా బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలు జరిగాయి. దుకాణాల ద్వారా గతంలో ఒక వ్యక్తికి మూడు సీసాలు మాత్రమే ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ నిబంధనను సైతం పక్కన పెట్టినట్లు తెలిసింది. ఒక్కో వ్యక్తికి పదేసి వరకు సీసాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. అవన్నీ బెల్టు షాపులకు చేరి అమ్మకాలు పెరగడానికి దోహదపడ్డాయన్న చర్చ సాగుతోంది.



వైన్ షాపు వద్ద బారులు తీరిన మందుబాబులు

మద్యం అమ్మకాల వివరాలు		
తేదీ	ప్రస్తుత అమ్మకాలు (రూ.కోట్లలో)	2022లో అమ్మకాలు (రూ.కోట్లలో)
13	5.89	5.41
14	7.73	7.33
15	8.74	7.99
16	8.47	8.35
17	7.41	5.36
మొత్తం	38.24	34.44

అమ్మకాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

మద్యం అమ్మకాలను పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిసింది. బెల్టుషాపులపై ఉదారంగా వ్యవహరించిన ప్రభుత్వం మందుబాబులకు కోరిన రకాలను అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నించింది. దుకాణాల్లో అత్యధికంగా అమ్ముడుపోయే మద్యం బ్రాండ్ల కొరత లేకుండా చూడాలని అధికారులకు సూచించింది. దీంతోపాటు మద్యం విక్రయాల వేళలనూ పెంచింది. సాధారణంగా దుకాణాలు ఉదయం 11 గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు తెరిచి ఉంటాయి. ఈ ఐదు రోజుల్లో ఉదయం పది గంటలకే తెరిచి రాత్రి పది వరకు విక్రయాలు సాగించారు.

మద్య నిషేధం అటకెక్కినట్టేనా?

మద్య నిషేధం అమలుపై ప్రభుత్వం రకరకాల పిల్లిమొగ్గలు వేస్తూ వస్తోంది. మద్యం తాగే వారి సంఖ్యను నియంత్రించడం కోసమే అంటూ 2020లో మద్యం ధరలను వంద శాతం పెంచింది. రేట్లు పెంచినా మద్యం తాగే వారు ఏమాత్రం తగ్గలేదు. మద్యం తాగే పరిమాణాన్ని మందుబాబులు తగ్గించుకోవడంతో అమ్మకాలు బాగా తగ్గాయి. దీంతో ప్రభుత్వం మద్యం ధరలను తగ్గించింది.

ప్రభుత్వం తొలుత 158 దుకాణాలతో ప్రారంభించి, పర్యాటకం పేరుతో 2021-22లో 19, 2022-23లో మరో తొమ్మిది పెంచింది. ప్రస్తుతం 186 దుకాణాలను నిర్వహిస్తోంది. ప్రభుత్వం వేస్తున్న అడుగలన్నీ మద్యం ద్వారా ఆదాయం పెంచుకునే చర్యలే కనిపిస్తున్నాయి. మరి ప్రభుత్వం చెప్పిన దశల వారీగా మద్య నిషేధం అమలు హామీ అటకెక్కినట్టేనా అనే చర్చ జనంలో నడుస్తోంది.

ఘనంగా రథసప్తమి వేడుకల నిర్వహణ

- 80 అడుగుల రోడ్డులో వాహనాల పార్కింగ్
- పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 28న రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. రథసప్తమి వేడుకల ఏర్పాట్లపై ఆలయంలోని అనివెట్టి మండపంలో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శనం కోసం వచ్చే యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు, ప్రసాదాల పంపిణీ తదితర చర్యలు చేపట్టాలని సూచించారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు, నిరంతరం విద్యుత్ ఉండేలా చూడాలన్నారు. ముందస్తుగా జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని, యాత్రికులకు నిరంతరం తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. వృద్ధులు, వికలాంగుల కోసం వీల్ చైర్లను ఏర్పాటు చేసి, అవి ఎక్కడ అందుబాటులో ఉంటాయో తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరం సిసి కెమెరాలు పనిచేసేలా చూడాలని, కమాండ్ కంట్రోల్ రూమ్‌లో రెవెన్యూ, దేవాదాయశాఖకు సంబంధించిన సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. పుష్కరిణి పరిసరాల్లో లైటింగ్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. యాత్రికుల వాహనాలను నగరంలోని 80 అడుగుల రోడ్డులో పార్కింగ్ చేయించాలని చెప్పారు. అన్ని శాఖలు సమన్వయంతో విధులు నిర్వహించి రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. అంతకుముందు 80 అడుగుల రోడ్డులో యాత్రికుల వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎస్‌పి జి.ఆర్ రాధిక, ఆర్‌డిఒ బి.శాంతి, డిఎస్‌పి మహేంద్ర, స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి పి.బాలరాజు, ట్రాఫిక్ డిఎస్‌పి సిహెచ్.జి.వి ప్రసాద్, దేవాదాయ శాఖ ఆర్‌జెడి ఎం.వి సురేష్‌బాబు, ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్, ఉప వైద్యారోగ్యశాఖ అధికారి అనురాధ, డిపిఒ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రథసప్తమి ఏర్పాట్లు పరిశీలన

యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు క్యూలైన్లు, బారికేడ్లతో పాటు ప్రవేశ ప్రాంతాలు, ఇతర సౌకర్యాలను ఎస్‌పి జి.ఆర్ రాధిక దేవాదాయ శాఖ ఆర్‌జెడి ఎం.వి సురేష్‌బాబుతో కలిసి పరిశీలించారు. ఇంద్రపుష్కరిణి, ఉచిత ప్రవేశం, విఐపి, వివిఐపి, దాతల కోసం ప్రత్యేక ప్రవేశ మార్గాలను పరిశీలించి సూచనలు చేశారు. కెమెరాలు, సెల్‌ఫోన్లు ఆలయం లోపలకు అనుమతించకుండా వాటిని భద్రపరచుకునేందుకు క్లాక్ రూమ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఏటా యాత్రికుల సంఖ్య పెరుగుతోందని, ప్రతి ఒక్కరికీ సజావుగా దర్శనమయ్యేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

వైభవంగా ఆదిత్యుని కళ్యాణం

పుష్య మాసం బహుళ ఏకాదశిని పురస్కరించుకుని అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి వారికి కళ్యాణం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి



ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ప్రయాణికుల రద్దీ

తిరుగు ప్రయాణం

ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో ప్రయాణికుల రద్దీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


సంక్రాంతి పండగకు స్వగ్రామాలకు వచ్చిన వారు తిరుగు పయనమవుతున్నారు. ప్రయాణికుల రద్దీతో ఆర్‌టిసి కాంప్లెక్స్ కిక్కిరిసింది. విద్య, ఉపాధి, ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు సంక్రాంతికి ముందు వారి గ్రామాలకు చేరుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సంక్రాంతికి సంతోషంగా గడిపారు. ఉపాధి నిమిత్తం ఇతర రాష్ట్రాలు, జిల్లాల్లో ఉన్న వలస కూలీలు, ఉద్యోగులు, విద్యార్థులు మంగళవారం నుంచే తిరుగుబాట పట్టారు. దీంతో శ్రీకాకుళం నగరంలో రద్దీ పెరిగింది. ముందుగానే రైల్వే టిక్కెట్లు రిజర్వేషన్లు కావడంతో దూర ప్రాంతాలకు వెళ్లే వారు బస్సులపైనే ఎక్కువగా ఆధారపడ్డారు. ఆర్‌టిసి పండగ నేపథ్యంలో వేసిన ప్రత్యేక బస్సులకూ సాధారణ ఛార్జీలే వసూలు చేయడం, రాయితీలు ఇవ్వడంతో ఆర్‌టిసి బస్సులకు ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఆర్‌టిసి బస్సులు ఖాళీ లేకపోవడంతో ప్రయివేటు బస్సులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా ప్రయివేటు ట్రావెల్స్ టిక్కెట్ ధరలను భారీగా పెంచాయి. గతంలో విజయవాడకు రూ.800 వరకు టిక్కెట్ వసూలు చేసే ప్రయివేటు ట్రావెల్స్ ఇప్పుడు ఏకంగా డిమాండ్‌ను బట్టి రూ.1500 నుంచి రూ.రెండు వేలు వరకు వసూలు చేస్తూ ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నాయి.

ఉపాధి కూలీలకు బీమా సౌకర్యం

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

ప్రజాశక్తి - గార

ఉపాధి హామీ కూలీలకు ప్రధానమంత్రి బీమా సురక్ష యోజన పథకాన్ని వర్తింపజేయనున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు తెలిపారు. మండలంలోని శ్రీకూర్మం పంచాయతీ పరిధిలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో ఆయన మాట్లాడుతూ కూలీలకు ఉపాధి హామీ ద్వారా ఆహార భద్రతతో పాటు జీవన భద్రతనూ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రతి కూలీకి వంద రోజుల ఉపాధి హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రూ.257 గరిష్ట కూలి పొందేందుకు గానూ కనీసం రోజుకు ఆరు గంటల పాటు పని ప్రదేశంలో పనిచేయాలని సూచించారు. పనులు నాణ్యతతో చేస్తే, వాటి ఫలితాలు మీ గ్రామానికి లభిస్తాయన్నారు. తద్వారా నీటి నిల్వ సామర్థ్యం చెరువుల్లో పెరగడం ద్వారా పంట దిగుబడి పెరిగి, నాణ్యమైన పంటలు చేతికి అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కూలీలకు అవసరమైన సాంకేతిక సలహాలను ఎప్పటికప్పుడు అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఒ సంధ్యారాణి, జెఇ నారంనాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ నాయుడు, రామచంద్రరావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు

ఇకెవైసి గడువు పొడిగించాలి

ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 20వ తేదీ లోగా ప్రభుత్వ పెన్షనర్లకు ఇకెవైసిని పూర్తి చేయాలన్న ఉత్తర్వులను జూన్ నెలాఖరు వరకు పొడిగించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.పార్వతీశం, ఎం.ఆదినారాయణమూర్తి కోరారు. కలెక్టరేట్ ఆవరణలోని జిల్లా ఖజానాశాఖ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 11వ తేదీన జారీ చేసిన జిఒ నంబరు 7 ద్వారా 20వ తేదీ లోగా ప్రభుత్వ పెన్షనర్లు ఇకెవైసిని పూర్తి చేయాలని ఆదశించడం సరికాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు లక్షన్నర, జిల్లావ్యాప్తంగా సుమారు 20 వేల మంది పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు ఉన్నారని, వీరందరికీ తొమ్మిది రోజుల్లో ఇకెవైసి పూర్తి చేయడం ఆచరణ సాధ్యం కాదన్నారు. ప్రస్తుతం పెన్షనర్లు లైఫ్ సర్టిఫికేట్లు అందజేసే పనిలో ఉన్నారని, ఈ సమయంలో మళ్లీ ఇకెవైసి, ఆధార్ నమోదు చేసుకోవడం ఇబ్బందికరమన్నారు. పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లలో 80, 90 ఏళ్లు పైబడిన వారున్నారని, మరికొందరికి అనారోగ్య సమస్యలున్నాయని, ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల్లో నివాసముంటున్నారని తెలిపారు. వీరందరికీ సమాచారం తెలియడానికే కొన్ని వారాల సమయం పడుతుందన్నారు. ఈనెల 16వ తేదీ నాటికి యాప్ ఓపెన్ కాకపోవడం వల్ల పెన్షనర్లు ఒత్తిడికి లోనై ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఇకెవైసి వ్యవధిని జూన్ వరకు పొడిగించాలని కోరారు. అప్పటివరకు ప్రస్తుత విధానాన్ని కొనసాగిస్తూ, ఒకటో తేదీనే పెన్షన్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు బకాయి ఉన్న కరువుభత్యం విడుదల చేసిచ, పెన్షనర్లకు న్యాయం చేయాలన్నారు. డీడీని కలిసిన వారిలో పెన్షనర్లు పి.సుధాకరరావు, ఎల్.అనంతరావు, పి.నీలకంఠేశ్వరరావు, కె.సూర్యారావు, పి.సన్యాసినాయుడు, పి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్లు

టిడ్కో గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు

ఎపి టిడ్కో చైర్మన్ జె.ప్రసన్న కుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వచ్చే నెలలో జగనన్న కాలనీలతో పాటు మూడేళ్ల కిందట నిర్మాణం పూర్తి చేసుకున్న టిడ్కో గృహ ప్రవేశాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేయాలని ఎపి టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, టిడ్కో ఇంజినీర్ల బృందంతో కలిసి పాత్రునివలసలోని టిడ్కో గృహ సముదాయాన్ని, టిడ్కో ఇళ్లకు తాగునీరందించే ప్రాజెక్టు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు తాగునీరు సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, రోడ్లు, గ్రీనరీ ఏర్పాటు చేయడం ద్వారా చక్కటి వాతావరణం కల్పించి లబ్ధిదారులకు ఇళ్లను అందజేయాలన్నారు. కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ పాత్రునివలస టిడ్కో గృహ సముదాయంలో 1280 మందికి గానూ 1269 మందికి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు వివరించారు. వారిలో 749 మందికి మార్ట్‌గేజ్ చేయాల్సి ఉండగా, అందులో 726 మందికి పూర్తి చేసినట్లు చెప్పారు. మిగిలిన వారిలో 51మంది డైరెక్ట్ పేమెంట్ చేసుకునేలా వెసులుబాటు కల్పించామన్నారు. కార్యక్రమంలో టిడ్కో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీరామ్మూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్న కుమార్

పరీక్షా కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఈనెల 22వ తేదీన పోలీస్ కానిస్టేబుల్ పరీక్షకు సంబంధించి టెక్కలిలోని పరీక్షా కేంద్రాలను ఎస్‌పి జి.ఆర్ రాధిక బుధవారం పరిశీలించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, విశ్వస్వతి డిగ్రీ కళాశాల, రవీంద్ర భారతి, బిఎస్ఎన్‌జిఆర్, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, 14 సెంటర్లలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణలో ఎటువంటి ఇబ్బందుల్లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సిఐ ఎస్.సూర్యచంద్రమౌళిని ఆదేశించారు. ఆమె వెంట ఎస్ఐ ఎల్.రామకృష్ణ ఉన్నారు.

అగ్నివీర్ ఎంపిక పరీక్షకు సందేహాల నివృత్తి

శ్రీకాకుళం అర్బన్ : భారత వాయుసేనలో అగ్నిపథ కింద అగ్నివీర్ ఉద్యోగాల ఎంపిక పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సందేహాల నివృత్తికి సెట్‌శ్రీ ఆధ్వర్యాన 93453 77868 వాట్సాప్ నంబరును అందుబాటులోకి తెచ్చినట్లు జిల్లా యువజన సర్వీసుల శాఖ ఇన్‌ఛార్జి సిఇఒ వి.వి అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆ నంబరుకు ఫోన్ చేస్తే సందేహాలను నివృత్తి చేస్తూ సమాచారం చెప్తారని వివరించారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సమన్వయంతో సత్ఫలితాలు

శ్రీకాకుళం అర్బన్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్దేశించిన బాధ్యతలను క్షేత్రస్థాయిలో సమన్వయంతో నిర్వహించి సత్ఫలితాలు సాధించాలని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో జగనన్న సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌ఛార్జీలతో పార్టీ రాష్ట్ర పరిశీలకులు హర్షవర్ధన్ రెడ్డితో కలిసి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఈనెల 20వ తేదీ లోగా అన్ని సచివాలయాల పరిధిలో గృహ సారథుల నియామకాలు తప్పనిసరిగా పూర్తి కావాలని, ఆ జాబితాలను 24వ తేదీ నాటికి పార్టీ జిల్లా కార్యాలయానికి అందజేసే బాధ్యత మండల ఇన్‌ఛార్జీలదేనని స్పష్టం చేశారు. సమావేశంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్ కుమార్, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త సాయిరాజ్, ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, తమ్మినేని చిరంజీవి నాగ్, నియోజకవర్గాల పార్టీ పరిశీలకులు ప్రసన్నకుమార్, కె.వి సూర్యనారాయణరాజు, కె.వెంకటరెడ్డి, డివి.జి శంకరరావు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, 30 మండలాల కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌టిఆర్ వర్ధంతి


శ్రీకాకుళం అర్బన్ : విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ, మాజీ ఎమ్మెల్యే


ఆమదాలవలస : రక్తదానం చేస్తున్న రవికుమార్


కవిటి : విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగువారి కీర్తిని నలుదిశలా వ్యాపించేలా నటుడిగా, రాజకీయ వేత్తగా ఎన్నో శిఖరాలు అధిరోహించిన వ్యక్తి నందమూరి తారక రామారావు అని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో కలిసి బుధవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని స్థాపించి తొమ్మిది నెలలకే రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకుని చరిత్ర సృష్టించారన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పేదల ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేశారన్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేశారన్నారు. అంతకు ముందు ఏడు రోడ్ల కూడలిలో ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అలాగే ఎన్‌టిఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యాన సూర్యమహల్ జంక్షన్ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, శింతు సుధాకర్, ముద్దాడ కృష్ణమూర్తినాయుడు, పి.ఎం.జె.బాబు, మెండ దాసునాయుడు పాల్గొన్నారు.

గొండు శంకర్ ఆధ్వర్యాన...

నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. గార, శ్రీకాకుళం మండలాలకు చెందిన టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : రాష్ట్రం నుంచి వైసిపిని తరిమికొట్టాలని, వైసిపి హఠావో తెలుగుదేశం పార్టీ నినాదం ఇదేనని, దానికి కార్యకర్తలంతా కృషి చేయాలని టిడిపి పార్లమెంటరీ పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు వర్ధంతి సందర్భంగా పారిశ్రామికవాడ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి బుధవారం పూలమాలు వేసి నివాళ్లర్పించారు. ఈ అనంతరం ఏర్పాటు చేసిన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ పార్టీలు పెట్టినంత మాత్రాన ఎన్‌టిఆర్‌తో సరిపోల్చుకునే అర్హత ఏ ఒక్కరికీ లేదన్నారు. తండ్రి శవాన్ని పక్కన పెట్టుకొని ఎమ్మెల్యేలతో సంతకాలు పెట్టించుకుని పదవి ఇవ్వలేదన్న అక్కసుతో పుట్టిన పార్టీ కాదని వ్యాఖ్యానించారు. అప్పటికి 40 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీని కూకటి వేళ్లతో పెకలించి కొత్త రాజకీయాలకు శ్రీకారం చుట్టిన వ్యక్తి ఎన్‌టిఆర్ అని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సనపల ఢిల్లేశ్వరరావు, నూకరాజు, మెట్ట సుజాత, మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, గీత, బొడ్డేపల్లి గౌరీపతి, లక్ష్మీనారాయణ, ఆనెపు రామకృష్ణ, శివ్వాల సూర్యం, చిగురుపల్లి రామ్మోహన్, బలగ శంకర భాస్కర్ పాల్గొన్నారు.

కవిటి: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి నందమూరి తారక రామారావు అని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. స్థానిక బస్టాండ్ కూడలిలోని ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మణిచంద్ర ప్రకాష్, సీపాన రమణ, పొందల కృష్ణారావు, బెందాళం రమేష్, ఎర్ర బాస్‌దేవ్ ప్రధాన్, బాసు దేవ్ రౌలో, సంతోష్ పట్నాయక్, రంగా రౌలో, లోళ్ల శ్రీను, పుల్లట సంతోష్, పుల్లట రాజు పాల్గొన్నారు.

నరసన్నపేట : టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి, ఆదివాంపేటలోని చిల్డ్రన్స్ పార్కులోని ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం టిడిపి సీనియర్ నాయకులు గొండు రామన్నకు దుశ్శాలువ కప్పి సన్మానించారు.

రణస్థలం : రామతీర్థాల కూడలిలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి కోష్ట మాజీ సర్పంచ్ పిషిణి జగన్నాథంనాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు, పైడి అప్పడుదొర, పిషిణి హరిబాబు, కనకారావు, తిప్పన బాబూరావు, గోవిందాసు రమేష్, కెల్ల హేమంత్, పిసిని చిన్న, లోకల్ చంటి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్థానిక షిరిడీ ఆలయం ప్రాంగణంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి టిడిపి మండల అధ్యక్షులు భాస్కర్‌గౌడ్, జిల్లా మహిళా ఉపాధ్యక్షులు బూర్ల లలిత కుమారి పూమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉర్లన వసంత్, చక్రి, పరమేష్, శశి, శ్రీధర్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : స్థానిక పాతబస్టాండ్ ఆవరణలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మండల పరిషత్ ఆవరణలోని విగ్రహానికి టిడిపి మండల అధ్యక్షుడు బోయిన రమేష్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షులు పూజారి శైలజ, ఎఎంసి మాజీ చైర్మన్ వెలమల విజయలక్ష్మి, మండల మాజీ ఉపాధ్యక్షుడు కల్లి నాగయ్యరెడ్డి, మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు లక్ష్మణరావు, పట్టణ టిడిపి అధ్యక్షుడు కోరాడ గోవిందరావు పాల్గొన్నారు.

పలాస: రక్తదానం మరొకరికి ప్రాణదానమని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం టిడిపి, శ్రీకాకుళం రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్ని రక్తదానం చేశారు. ఈ మేరకు 66 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, బి.రాజు పాల్గొన్నారు.

టెక్కలి : టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ జి.జగన్మోహనరావు పర్యవేక్షణలు ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ మేరకు 60 మంది యువకులు శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, ఎస్‌సి సెల్ విభాగం జిల్లా అధ్యక్షులు మట్ట పురుషోత్తం, తెలుగు యువత రాష్ట్ర నాయకులు రెయ్యి ప్రీతీష్‌చంద్, హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, పోలాకి షణ్ముఖరావు, బెహరా కాళి, కోళ్ల లవకుమార్, మల్లిపెద్ది మధు, కామేష్, బగాది సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

లావేరు : ఎన్‌టిఆర్ యుగపురుసుడు అని టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొరలు అన్నారు. లావేరులోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లంకలపల్లి శ్రీనివాసరావు, జగన్నదొరబాబు, దారపురెడ్డి కూర్మారావు, ఆనంద్ సత్తిబాబు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.


పలాస : ప్రశంసాపత్రం అందజేస్తున్న గౌతు శిరీష


నరసన్నపేట : రామన్నను సన్మానిస్తున్న రమణమూర్తి


శ్రీకాకుళం అర్బన్ : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న శంకర్

కార్యక్రమంలో సాలీనా ఢిల్లీ యాదవ్, కొండ శంకర్‌రెడ్డి, నందిక జాని, లీలారాణి, కోటేశ్వరరావు, కాళ్ల జయదేవ్, తవిటియ్య, సాడి సహదేవరెడ్డి, దక్కత ఢిల్లీరావు, లోపింటి పద్మనాభం, సంతోష్, విశ్వనాధ్, జానకీరావు పాల్గొన్నారు.

కంచిలి : కంచిలిలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు మాదిన రామారావు, బి.కామేష్‌రెడ్డి, టి.వి.రమణ, పిలక చిన్నబాబు, బొడ్డ రాంకుమార్, బంగారు కురయ్య, ఎం.ఆనంద్‌లు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

సోంపేట: సోంపేట ఆస్పత్రి వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో బి.ఆనంద్, ఈశ్వరరావు, డి.జోగారావు, డి.మధుర, ఆర్.శ్రీను, ఎం.రవి, బి.బాబూరావు, వి.కృష్ణ, బి.సీతారాం, కె.రాఘవదాస్ పాల్గొన్నారు.


సైకిళ్లను పంపిణీ చేస్తున్న మంత్రి ధర్మాన

రోటరీ సేవలు ప్రశంసనీయం

రెవెన్యూ మంత్రి ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎటువంటి లాభాపేక్షను ఆశించకుండా తమకు చేతనైనంత సాయం చేయాలన్న దృక్పథంతో రోటరీ క్లబ్ సెంట్రల్ కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ప్రపంచ స్థాయిలో రోటరీ సేవలకు మంచి గుర్తింపు ఉందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. నగరంలోని గూనపాలెంలో రోటరీక్లబ్ సెంట్రల్ ఆధ్వర్యాన పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, మహిళలకు టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అనేక మందికి ప్రయోజనం కలిగించేవిధంగా ఈ సంస్థ పనిచేస్తోందని కితాబిచ్చారు. నగరంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్‌ను అభివృద్ధి చేశామని తెలిపారు. నగరానికి నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. అనంతరం సిసి రోడ్డు నిర్మించాలని కోరుతూ సభ్యులు వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన మంత్రి కమిషనర్‌తో ఫోన్లో మాట్లాడారు. సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కింతలి నాగేశ్వరరావు, జె.వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.సోమేశ్వరరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, శంకర్ నారాయణ, డాక్టర్ సుధీర్, కెప్టెన్ జగదీష్, కొంక్యాన మురళీధర్ పాల్గొన్నారు.

పల్లె కోయిల.. పాట తీయగా...

- గాత్రంతో అలరిస్తున్న సంగారు రాము
- అవకాశాల కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి- కవిటి

అద్భుతమైన గాత్రం ఆయన సొంతం. అలవోకగా పాట పాడటం ఆయన స్వభావం. సినిమా పాటల నుంచి పల్లె పాటల వరకు.. ఆయన గళం నుంచి పాట జారువాలితే శ్రోతల మనసు ఉప్పొంగుతోంది. కవిటి మండలానికి చెందిన పలు గ్రామాల పేర్లు, అక్కడ దొరికే వస్తువులతో రాసిన పల్లెపాట విశేష ఆదరణ పొంది బాహ్య ప్రపంచానికి సంగారు రాముని పరిచయం చేసింది. దీంతో ప్రస్తుతం ఆ పాట యుట్యూబ్ లో ట్రెండింగ్‌లో ఉంది. కవిటి మండలం కపాసుకుద్ది గ్రామానికి చెందిన సంగారు రాము కుటుంబానిది రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి. దీంతో ఇంటర్మీడియట్ స్థాయిలోనే చదువుకి స్వస్తి చెప్పి తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. కానీ సినిమా పాటలపై ఆయన మనసులో అంతర్లీనంగా దాగి ఉన్న మమకారం మాత్రం అలానే ఉండేది. దీంతో అవకాశం వచ్చినప్పుడల్లా రాము తన గాత్రంతో శ్రోతలను మంత్రముగ్దులను చేస్తూనే ఉన్నాడు. అయితే ఇటీవల ఆయన పాడిన ఫోక్ సాంగ్ విపరీతంగా వైరల్ అయి రాము ప్రతిభ బాహ్య ప్రపంచానికి తెలిసేలా చేసింది. దీంతో అంతకు ముందు రాము పాడిన గీతాగోవిందం, తొలిప్రేమ, డార్లింగ్ తదితర సినిమాల్లో పాటలపై ఇప్పుడు శ్రోతల దృష్టి మళ్లింది. అరె ఇంతకాలం ఇంత శ్రావ్యమైన కంఠం మన మధ్యలోనే ఉందా అనేలా చేసింది. అయితే ఆర్థిక సమస్యలు, తగినంత సహకారం లేకపోవడంతో ఇంకొకరి పాటకు వాడిన సంగీతం తనపాటకు అన్వయించుకున్నాడు రాము. గంటల వ్యవధిలోనే ఆ పాటకు అసాధారణ ప్రశంసలు రావడంతో ఆ పాటకు వాడిన సంగీతంపై ప్రస్తుతం ఆంక్షలు విధించారు. మా సంగీతం నువ్వు వాడుకోవడానికి వీల్లేదు, వెంటనే ఆ పాట యుట్యూబ్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. చేసేది లేక రాము దాన్ని తొలగించాడు. అయితే అప్పటికే అది పూర్తిస్థాయిలో వైరల్ అయింది. దీంతో ప్రస్తుతం పలు కార్యక్రమాల్లో పాడమని రాముకి అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా ఇండియన్ ఐడల్ కార్యక్రమానికి రాము స్క్రీన్ టెస్ట్‌కు ఎంపికవ్వడం విశేషం.



తల్లిదండ్రులతో రాము, పాడుతున్న రాము

సినిమాలో పాడటమే నా లక్ష్యం

మా అమ్మ, నాన్న కష్టపడితేనే మాకు నాలుగు మెతుకులు కడుపులోకి వెళ్లేది. ఇటువంటి పరిస్థితుల్లో నన్ను, మా అన్నయ్యను చదివించడం మా తల్లిదండ్రులకు కష్టంగా మారింది. దీంతో నేను చదువు మధ్యలోనే ఆపేసి నా తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటున్నాను. మా అన్నయ్య డిప్లమో పూర్తిచేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. ఇక చిన్నప్పటి నుంచి పాటలు పాడటం అంటే నాకు పిచ్చి. కొత్త సినిమాలో పాట వచ్చిందంటే అది నేనైతే ఎలా పాడుతానా అని పదేపదే పాడే వాడిని. సంగీతంపై అమితమైన ఆసక్తి ఉన్నా నేర్చుకోవడానికి నా కుటుంబ నేపథ్యం సహకరించ లేదు. అయినప్పటికీ ప్రతి పాటా లయబద్ధంగా పాడటం నేర్చుకున్నాను. అయితే ఇటీవల నేను పాడిన పల్లెపాట విపరీతమైన ఆదరణ పొంది నన్ను బయట ప్రపంచానికి పరిచయం చేసింది. దీంతో నేను గతంలో పాడిన సినిమా పాటలు కూడా ఇప్పుడు యుట్యూబ్‌లో విశేష ఆదరణ పొందుతున్నాయి. ఎప్పటికైనా సినిమాలో పాడాలనేది నా లక్ష్యం.

- సంగారు రాము
సింగర్
కపాసుకుద్ది

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సింహాచలం (ఫైల్)

కోటబొమ్మాళి: మండలంలోని నారాయణపురం సమీపంలో బుధవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఉర్జాన సింహాచలం (55) మృతి చెందాడు. సింహాచలం సైకిల్‌పై వెళ్తుండగా... వెనుక నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సింహాచలం తీవ్రంగా గాయపడి అక్కడకక్కడే మృత్యువాత పడ్డాడు. మృతునికి భార్య రమణమ్మ, కుమార్తె ఉన్నారు. వీరంతా వ్యవసాయ కూలీపని చేసుకొని జీవనం సాగిస్తున్నారు. కుటుంబ పెద్ద దిక్కుకోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హెడ్ కానిస్టేబుల్ విశ్వేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


బోల్తా పడిన ఆటో

ధాన్యం లగేజీ ఆటో బోల్తా

ప్రజాశక్తి- పలాస

మండలంలోని కోసంగిపురం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై లగేజీ ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ధాన్యం బస్తాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. ప్రమాదం నుంచి డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే సిబ్బంది పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ వాహనాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించారు.


సమస్యలు తెలుసుకుంటున్న రాహుల్ కుమార్ రెడ్డి

మారడికోట సందర్శన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని మారడికోట గ్రామాన్ని సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి బుధవారం సందర్శించారు. ఇక్కడ ఈనామ్ భూములు సాగు చేస్తున్న రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు విన్న సబ్‌కలెక్టర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. అలాగే ఈనామ్ భూములకు సంబంధించిన వివరాలను అధికారులకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించారు. ఈయనతో పాటు తహశీల్దార్ పి.సరోజిని, సర్పంచ్ పెద్దింటి భాగ్యం శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ అగ్గాల శ్రీనివాసరావు ఉన్నారు.

జీతాలు లేక వాలంటీర్ల అవస్థలు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న వార్డు వాలంటీర్లకు ఈ నెల జీతాలు అందక పండగ పూట ఆర్థిక ఇబ్బందులు పడ్డారు. సంక్రాంతి పండగకు ముందే మున్సిపల్ కమిషనర్ రమేష్‌ను కలిసి జీతాలు చెల్లింపు కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. అయినా 120 మందికి పైగా వాలంటీర్లకు జీతాలు అందకపోవడంతో కుటుంబాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు క్రమం తప్పకుండా తీసుకోని వెళ్లే వాలంటీర్లకు జీతాలు సకాలంలో చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.


కమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న వాలంటీర్లు (ఫైల్)

సంక్షిప్త వార్తలు

రుణాలు చెల్లించి రాయితీ పొందాలి


శాస్త్రి

బూర్జ: రైతులు సకాలంలో రుణాలను చెల్లించి రాయితీలు పొందాలని పిఎసిఎస్ సిఇఒ శాస్త్రి ఒక ప్రకటనలో తెలిపారు. బూర్జ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని వ్యవసాయ రుణాలు పొందిన లబ్ధిదారులు వారి రుణాలను ఫిబ్రవరి 20లోగా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. అందుకు రైతులు 4 శాతం వడ్డీ చెల్లించి ప్రభుత్వం ప్రకటించిన రాయితీ పొందాలని కోరారు. రైతులకు 50 సెంట్లకు రూ.లక్ష, 76 సెంట్లకు రూ.2 లక్షలు, 1.50 సెంట్లకు ఎస్‌టిలకు, ఇతరులకు రూ.4 లక్షలు పొందుతారని పేర్కొన్నారు. దీని కోసం రైతులు ఇకెవైసి చేసుకున్న పాసు పుస్తకం, ఆధార్, పాలకొండ కో-ఆపరేటివ్ బ్యాంకు ఖాతా పుస్తకం నఖళ్లు జత చేసి ఇవ్వాలని సూచించారు. ఇతర వివరాలకు 9394751346, 9704996232 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

'పవన్ కళ్యాణ్‌ను దూషించడం సరికాదు'

టెక్కలి : జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌ని విమర్శించే హక్కు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు లేదని టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్ కుమార్ అన్నారు. జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. దువ్వాడ రాజకీయాలు నీచ రాజకీయాలని విమర్శించారు. ప్రజారాజ్యం పార్టీలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా విజయం సాధించలేక ఓట్లు నమ్ముకునే నేర చరిత్ర కలిగిన వ్యక్తి అని అన్నారు. పవన్ కళ్యాణ్‌పై అసభ్య పదజాలంతో దూషించడం దువ్వాడ మానుకోవాలని హితవుపలికారు. దువ్వాడ ప్రతిపక్ష నాయకులపై చేసే విమర్శల కన్నా టెక్కలి అభివృద్ధిపై దృష్టి పెడితే మంచిదని సూచించారు. ఈయన వెంట అట్టాడ శ్రీధర్, మెట్ట అవినాష్, చందు, రమేష్. కె.హరిగురయ్య ఉన్నారు.

సచివాలయ కన్వీనర్ల ఇన్‌ఛార్జిగా నాగభూషణరావు


నాగభూషణరావు

కోటబొమ్మాళి: మండలంలోని సచివాలయాల కన్వీనర్లు ఇన్‌ఛార్జిగా మాసాహెబ్‌పేటకు చెందిన వైసిపి నాయకులు గడ్డవలస నాగభూషణరావును నియమిస్తూ రిజనల్ కో-ఆర్టినేటర్ హర్షవర్ధన్ బుధవారం ధ్రువీకరణ పత్రం అందజేశారు. నాగభూషణరావు ఎన్నికపై పిఎసిఎస్ అధ్యక్షుడు బాడాన మురళీధర్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజా, మండల కో-ఆప్షన్ మెంబర్ షేక్ రాజు, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజ్ అభినందనలు తెలియజేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ మంజూరు


రామారావు

కంచిలి: మండలంలోని పెద్దసైరాపురం పంచాయతీలో బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ మంజూరైందని, త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు సర్పంచ్ ప్రతినిధి మాదిన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో సెల్‌సిగ్నల్స్ లేవనే విషయాన్ని ఇటీవల ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌లకు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎంపీ లాండ్ నిధులతో మంజూరైన సెల్ టవర్ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని చెప్పారు. దీంతో వారి కృషి ఫలితంగా బిఎస్ఎన్ఎల్ టవర్ మంజూరైందని తెలిపారు. ఇందుకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వేస్టేషన్ రద్దీ


రద్దీగా ఉన్న రైల్వే స్టేషన్

ఇచ్ఛాపురం : సంక్రాంతి పండగ సందర్భంగా వివిధ ప్రదేశాల నుంచి సొంత గ్రామాలకు వచ్చారు. ఆయా గ్రామాల్లో ఆనందంగా గడిపారు. గురువారం స్కూళ్లు పున:ప్రారంభం కావడంతో పిల్లాపాపలతో తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో రైల్వేస్టేషన్, ఆర్‌టిసి బస్సు కాంప్లెక్స్ బుధవారం ఉదయం నుంచే రద్దీగా ఉంది. మూడు రోజుల పాటు సొంత గ్రామాల్లో పండగ చేసుకుని ఎవరు ఉపాధి, ఉద్యోగ కోసం ప్రయాణమయ్యారు.

గురుకులాలు కళకళ


యోగా చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

జిల్లాలో మహాత్మా జ్యోతిబాపులే(ఎం.జె.పి.) గురుకుల పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. ఈ గురుకుల పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణం, పరిశుభ్రమైన తరగతి గదులు, సువిశాల క్రీడా మైదానాలు, నాణ్యమైన భోజనం ప్రభుత్వం సమకూర్చడంతో ఈ విద్యా సంవత్సరం సీట్లన్నీ పూర్తిగా నిండి పోయాయి.

జిల్లా లో 11 ఎంజెపి పాఠశాలల్లో 2794 విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో 520 మంది ఐదో తరగతిలో ప్రవేశాలు పొందారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో 5600 దరఖాస్తులు రావడం విశేషం. లాటరీ పద్ధతిలో 520 మందిని సీట్లు కోసం ఎంపిక చేశారు. బాలికల కోసం టెక్కలి, శ్రీకాకుళం, ఆమదాలవలస, పాతపట్నం, పలాసలో, బాలురు కోసం అంపోలు, నరసన్నపేట(గుండివల్లిపేట), కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, అక్కుపల్లి, లోలుగు(పొందూరు)లో గురుకులాలు నిర్వహిస్తున్నారు. ఆంగ్ల భాషలో తరగతులు నిర్వహిస్తుండగా ఈ విద్యా సంవత్సరం నుంచి టెక్కలి, అంపోలు గురుకులాల్లో సిబిఎస్ఇ సిలబస్‌ను 8వ తరగతి నుంచి అమలు చేస్తున్నారు. విడతల వారీగా మిగిలిన స్కూల్సోలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విద్యా సంవత్సరం నుండి కోటబొమ్మాళిలో కొత్తగా ఏర్పాటు చేసినప్పటికీ ఇక్కడ కూడా సీట్లు పూర్తిగా నిండి పోయాయి. ప్రభుత్వం సౌకర్యం కల్పించడంతోపాటు పాఠ్య పుస్తకాలు, ఇతర స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తుంది. చదువుకే పరిమితం కాకుండా యోగా క్లాసులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం అంపోలు, టెక్కలిలో శాశ్వత భవనాలు ఉండగా మిగిలిన గురుకులాల్లో శాశ్వత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అక్కుపల్లి, శ్రీకాకుళంలో స్థల పరిశ్రమ జరుగుతోంది. మిగిలిన పాఠశాలల ప్రిన్సిపాల్స్ ఆయా మండలాల తహశీల్దార్‌లకు స్థలం కోసం వినతిపత్రాలు అందజేశారు.

నరసన్నపేట పాఠశాల ప్రత్యేకత

జిల్లాలో ఉన్న పాఠశాలన్నింటిలో నరసన్నపేట పాఠశాలకు ప్రత్యేకత గుర్తింపు ఉంది. సాఫ్ట్‌బాల్ అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం, బాల్ బ్యాడ్మింటన్ అండర్-14 భాగంలో ద్వితీయ స్థానం సాధించారు. విద్యార్థులకు ప్రత్యేకంగా యోగా శిక్షణ ఇస్తున్నారు. ఈ పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటికి ఐదుగురు విద్యార్థులు ఉత్తీర్ణత పొంది, ఆన్‌లైన్ కోచింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. మండల, జోనల్ లెవల్‌లో సైన్ స్వేర్ ప్రాజెక్టుల్లో విద్యార్థులు పాల్గొని ద్వితీయ స్థానం సాధించారు.


పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల సహకారంతో ముందుకు..



ఈ పాఠశాలలో మెరుగైన ఫలితాల కోసం నిరంతరం పాఠశాలలో ఉంటూ ఉపాధ్యాయుల సహకారంతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాం. చదువుతో పాటు యోగా, క్రీడలపై ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నాం.

-ఎన్.అర్చన, ప్రిన్సిపాల్,
గురుకుల పాఠశాల గుండివల్లిపేట

క్రీడల్లో రాణిస్తున్నారు



ఈ పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు పది మంది విద్యార్థులు ఎంపిక కాబడ్డారు. బాల్ బ్యాడ్మింటన్, సాఫ్ట్‌బాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ వంటి క్రీడల్లో పాఠశాలలో విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు. క్రీడలు, యోగాపై రోజు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం.

-ఎం.మధు, పిఇటి
ఎంజెపి గురుకుల పాఠశాల

ఎన్‌టిఆర్ దంపతుల ఆలయ నిర్మాణానికి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని వి.ఎన్.పురంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు నందమూరి తారక రామారావు, బసవతారక దంపతుల ఆలయాన్ని నిర్మాణానికి టిడిపి సీనియర్ నాయకులు, పొందూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు, ఉత్తరాంధ్ర టిడిపి శిక్షణా తరగతుల మాజీ డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు గ్రామంలో బుధవారం ఆలయ నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహానుభావుడు ఎన్‌టిఆర్‌కు ఆలయం నిర్మిస్తుండడంతో గర్వకారణంగా ఉందన్నారు. టిడిపి స్థాపించిన నాటికి ఉమ్మడి ఆంధ్రాలో అన్ని గ్రామాలూ కాంగ్రెస్ చేతుల్లో ఉన్నాయన్నారు. అప్పట్లో మా అన్న కలిశెట్టి సహదేవుడు ఆధ్వర్యాన టిడిపి జెండాను ఎగురవేశారని పేర్కొన్నారు. ఆదే స్ఫూర్తితో ఎన్‌టిఆర్ దంపతుల ఆలయాన్ని నిర్మించాలని సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు.


పనులు ప్రారంభిస్తున్న అప్పలనాయుడు


విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఈశ్వరరావు

క్రీడలతో మానసిక ఉల్లాసం

వజ్రపుకొత్తూరు: క్రీడలతో మానసిక ఉల్లాసంగా వస్తుందని గరుడభద్ర సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వరరావు అన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా సైనింగ్ స్టార్ యువజన సంఘం ఆధ్వర్యాన గ్రామంలో నాలుగు రోజులు పాటు గ్రామస్థాయి ఆటల పోటీల నిర్వహించారు. ఈ మేరకు బుధవారం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి ఆటల పోటీలు మన ముందు తరం పెద్దలు మనకిచ్చిన బాధ్యత అని అన్నారు. అవి రేపటి తరం వారికి కానుకగా ఇవ్వాలని అన్నారు. ఈ ఆటల పోటీల వల్ల అన్నదమ్ముల్లా కలిసి మెలసి ఉంటారన్నారు. ఈ నాలుగు రోజులు పాటు కబడ్డీ, ఖోఖో, క్రికెట్, క్విజ్, ముగ్గులు, పాటలు, డాన్స్, సెటిల్ కుర్చీల రుమాలాట, రన్నింగ్, స్కిప్పింగ్, కుండకొట్టిన ఆటల పోటీలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షులు వై.ధర్మారావు, యువజన సంఘం అధ్యక్షులు చెళ్లురు పాపారావు, క్రీడా నిర్వహణ కమిటీ చైర్మన్ నిఖిల్, వార్డు మెంబరు ధనరాజ్, పి.భీమారావు, కె.మోహనరావు, ఆనందరావు, టి.అప్పలస్వామి పాల్గొన్నారు.


మెమొంటోలతో ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ప్రజాశక్తి- జలుమూరు

మండలంలోని యలమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2015-16, 2022-23 విద్యా సంవత్సరాల్లో పనిచేసిన ఉపాధ్యాయులకు 'గురువులకు కృతజ్ఞతా పూర్వక వందనాలు' కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎం.రవికుమార్ మాట్లాడుతూ యలమంచిలి ఉన్నత పాఠశాల నుంచి 2015-16లో ఐదుగురు, 2022-23లో ఇద్దరు ట్రిబుల్ ఐటికి ఎంపిక కావడం హర్షనీయమన్నారు. అలాగే ట్రిపుల్ ఐటికి ఎంపికైన ఏడుగురు విద్యార్థులనూ సన్మానించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంఇఒ బి.మాధవరావు, ప్రధానోపాధ్యాయులు రఘునాధరావు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసిలు, విద్యా కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

నడక పోటీల్లో సుధాకర్ ప్రతిభ

ప్రజాశక్తి- లావేరు



మండల కేంద్రం లావేరు జిల్లా పరిషత్ ఉన్నతి పాఠశాలకు చెందిన ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు సంజీవిని నళినిసుధాకర్ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభకనబర్చి సిల్వర్ పథకాన్ని సాధించారు. ఈ నెల 14 15 తేదీల్లో శ్రీలంక దేశంలోని కొలంబో పట్టణంలో నిర్వహించిన 36వ అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఐదు కిలోమీటర్ల నడకపోటీల్లో పాల్గొని సిల్వర్ పథకాన్ని సాధించారు. పథకాన్ని ఇండియన్ డిప్యూటీ కమిషనర్ ఇల్డోష్ మాతుస్, ఇండియన్ టీమ్ మేనేజర్ ఉదకుమార్‌శెట్టి బహుమతి, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ పోటీక్ల భారతదేశం నుంచి 40 మంది క్రీడాకారులు ఎంపిక కాగా, ఇందులో తెలుగు రాష్ట్రాల్లో శ్రీకాకుళం జిల్లా నుంచి సుధాకర్ ఎంపికయ్యారు. 40 ఏళ్లుగా పలు దేశాల్లో నిర్వహించిన నడక పోటీల్లో పాల్గొని పలు పథకాలు సాధించిన విషయం అందరికీ తెలిసిందే.


అవగాహన కల్పిస్తున్న హరిప్రసాద్

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ఇచ్ఛాపురం : ప్రతి వాహనదారుడూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రవాణా శాఖ అధికారి హరిప్రసాద్ అన్నారు. స్థానిక బస్ స్టాండ్ కూడలి వద్ద ఆటో, టాక్స్ డ్రైవర్లకు, ప్రజలకు 34వ రహదారి భద్రతా వారోత్సవాలు సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నియంత్రించవచ్చునని పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడి వద్దా వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిఐ ఈశ్వర్‌చంద్రప్రసాద్, పట్టణ ఎస్ ఐ.గోవిందరావు, రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

దాసుబాబు సేవలు ఆదర్శం

శ్రీకాకుళం అర్బన్ : రెవెన్యూశాఖలో నిజాయతీ గల అధికారిగా పనిచేయడమే కాకుండా ఎంతో మందిని నిష్టాతులుగా తీర్చిదిద్ది కలెక్టర్ల నుంచి ప్రశంసలు అందుకున్న దాసుబాబు ఆదర్శప్రాయులని శిష్ట కరణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. నగరంలోని పాత శ్రీకాకుళంలో డికె దాసుబాబు వర్థంతి సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో అఖిల భారత శిష్ట కరణం సంఘం కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, బి.వి.ఎన్ఎస్.ప్రభు, పి.జగన్మోహనరావు, వాసు, బలివాడ ప్రశాంత్, అమర్నాథ్, గోపాల్, షర్మిల, శిరీష పాల్గొన్నారు.

కంపు కొడుతున్న పల్లెలు

- పట్టించుకోని అధికారులు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు


అన్నంపేటలో బోరు చుట్టూ ఉన్న మురుగునీరు


రోడ్డు పక్కన నిల్వ ఉన్న మురుగునీరు

ప్రజాశక్తి- బూర్జ

పాలకులు, అధికారుల ఉదాసీనత మండల ప్రజలకు శాపంగా మారింది. పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు అని నానుడి ఉన్నా... అధికారులు చొరవ చూపకపోవడంతో ఆ పల్లెలు అభివృద్ధికి ఆమడ దూరంలో దర్శనమిస్తున్నాయి మండలంలోని ఏ గ్రామంలో చూసిన పారిశుధ్యం తాండవిస్తోంది. పారిశుధ్యంపై దృష్టి పెట్టాల్సిన అధికారులు చొరవ కరువైందని సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఇఒపిఆర్‌డి గ్రామ పంచాయతీల పనితీరుపై దృష్టి పెట్టి పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సమస్యలను పట్టించుకోవాల్సి ఉంది. అయితే గత కొంతకాలంగా ఆ స్థాయి అధికారులు జాడ కరువడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. ఇక్కడ ఇఒపిఆర్‌డిగా పనిచేస్తున్న హరిహరరావు పొందూరు మండలానికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. జీతం ఇక్కడ తీసుకొని విధులు అక్కడ నిర్వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వారానికి ఒక్కసారైనా కార్యాలయానికి వచ్చిన దాఖలు లేవని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తీరు ఎలా ఉంటే... గ్రామాల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో చెప్పనవసరం లేదు. పట్టించుకోవాల్సిన అధికారులే ఉదాసీనంగా వ్యవహరించడంతో అన్ని పంచాయతీల్లోనూ సమస్యలు తిష్ట వేశాయి.

అంతా కంపుమయం.

గ్రామాలు కంపు కొడుతున్నాయి. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. కాలువలు లేకపోవడంతో మురుగునీరు రహదారులపై ప్రవహిస్తుంది. బాటసారిలను నడవాలంటేనే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎప్పుడు ఏ వ్యాధి బారిన పడతామోనని భయాందోళన చెందుతున్నారు. మండలంలోని చీడివలస, బూర్జ, పాలవలస, అన్నంపేట, మామిడివలస పెద్దల గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

మరోవైపు సంక్రాంతి పండగ కావడంతో ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న గ్రామస్తులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని గ్రామస్తుల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇంతవరకు గ్రామాల్లో బ్లీచింగ్ చల్లడం గాని, దోమల నివారణకు పిచికారీ చేయడం కాని చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందని గ్రామస్తులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించి మెరుగుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి



మండల కేంద్రంలోని బూర్జలో పారిశుధ్యం పూర్తిగా క్షీణించింది. వారానికి ఒకసారైనా పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టి మెరుగుకు కృషి చేయాలి.

- నేతల జయమ్మ, వార్డు మెంబరు

ఘనంగా రుద్రరాజు జన్మదిన వేడుకలు


రణస్థలం రూరల్ : వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవాన్ని తీసుకురావడానికి పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని కాంగ్రెస్ నాయకులు అంబటి కృష్ణారావు అన్నారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో రుద్రరాజు జన్మదిన వేడుకలను బుధవారం నిర్వహించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో దేశెల్ల గోవింద మల్లిబాబు, దంత త్రినాథరావు, మంత్రి నరసింహమూర్తి, బయలు రాజేశ్వరరావు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్ : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు జన్మదినం సందర్భంగా మండల కేంద్రం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొత్తకోట్ల సింహాద్రినాయుడు, డిసిసి ప్రధాన కార్యదర్శి కొత్తకోట్ల లక్ష్మి, యండ సూర్యనారాయణ, కె.జోగినాయుడు, ఎ.జగదీష్‌నాయుడు, మీసాల గణేష్, ఎం.రమణ, పి.గోవింద్, ఎల్.చిన్న, ఎల్.గౌరినాయుడు పాల్గొన్నారు.

సురక్ష బీమా యోజనను వినియోగించుకోవాలి

కోటబొమ్మాళి: మండల వ్యాప్తంగా ఉన్న ఉపాధి హామీ కూలీలందరూ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.ఫణీంద్రకుమార్ అన్నారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 నుంచి 50 ఏళ్ల మధ్య ఉన్న వారు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు కూలి మృతి చెందితే రూ. 2 లక్షలు, అంగవైకల్యం అయితే రూ.లక్ష పరిహారంగా బీమా సంస్థ చెల్లిస్తుందన్నారు. ఇందుకు గాను ప్రతి కూలీ ఏడాదికి రూ.20 చొప్పున ప్రీమియంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. గ్రామస్థాయిలో వెలుగు ప్లాస్టర్ ఫెసిలిటేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు సమన్వయంతో ఈ పథకంలో కూలీలను భాగస్వాములను చేయాల


మాట్లాడుతున్న ఎంపిడిఒ ఫణీంద్రకుమార్

న్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో పనులు ప్రారంభించి లక్ష్యాలను చేరుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పనిప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. వంద శాతం కూలీలను ఈ పథకంలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఎపిఒ కె.అరుణ్‌కుమార్, ఇసి జి.హరిప్రసాద్ పాల్గొన్నారు.

మినప పంటలో 'పెస్ట్ సర్వేలైన్స్'


పెస్ట్ సర్వే లైన్స్ చేపడుతున్న సిబ్బంది

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని చేపేనపేటలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మినప పంటలో ఫెస్ట్ సర్వే లైన్స్ నిర్వహణ బుధవారం చేపట్టారు. ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి నక్క చిరంజీవి మాట్లాడుతూ దీనివల్ల పంటల్లో తెగుళ్లు, పురుగులు వచ్చే చీడపీడలను అరికట్టవచ్చని తెలిపారు. రైతులు వ్యవసాయ క్షేత్రాల్లో సమగ్రంగా సర్వే లైన్స్ చేపట్టడం ద్వారా వివిధ దశల్లో పంటల్లో వచ్చే తెగుళ్లను గుర్తించి వాటి నియంత్రణకు ప్రకృతి వ్యవసాయంలో మెరుగైన పద్ధతులు ఉన్నాయన్నారు. సహజ సేద్య పద్ధతిలో పంటల్లో అధిక దిగుబడి, అంతర పంటలు సాగు, ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటలకు రసాయన వ్యవసాయంలో పండిస్తున్న రైతుల పంటల వ్యత్యాసాన్ని నేరుగా రైతులు వద్దనే తెలియపరచవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మల్లేశ్వరరావు, కృష్ణవేణి పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చుకోవాలి

ఇచ్ఛాపురం: పేదవాడు సొంతింటి కల నెరవేర్చుకోవాలని త ఇంటి కల నెరవేర్చుకోవాలని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు అర్బన్ హౌసింగ్ అధికారి సిహెచ్.మల్లేశ్వరరావు మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. స్థానిక మెప్మా కార్యాలయంలో అధికారి జానకిరావు అధ్యక్షతన డ్వాక్రా సంఘాలు ఆర్‌పిలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలపై అర్‌పిలు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి లబ్ధిదారులు ఇళ్ల నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మార్చి 31లోగా ఇళ్ల నిర్మాణాల చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల


మాట్లాడుతున్న మల్లేశ్వరరావు

నిర్మాణాల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సిఒ బాలరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

కొసమాలలో 'ఇదేం కర్మ'

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని కోసమాలలో నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు భాస్కర్ గౌడ్, జిల్లా మహిళా ఉపాధ్యక్షులు బూర్ల లలితకుమారి, ఉర్లాన వసంత్, బొచ్చు ప్రసాద్, సిరిపురం వెంకటరావు, ధర్మారావు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

వజ్రపుకొత్తూరు : సంక్రాంతి పండుగ సందర్భంగా బాతుపురం-పెదవంక యూనిటీ ఫౌండేషన్ ఆధ్వర్యాన మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన విజేతలకు బుధవారం ఫౌండేషన్ సభ్యులు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి చెల్లూరు కళ్యాణి, ద్వితీయ బహుమతి, బత్తిని శారద, తృతీయ బహుమతి ఇరోతు అరుణ కైవసం చేసుకున్నారు. ముగ్గుల పోటీ విజేతలకు ఫౌండేషన్ సభ్యులు అభినందించారు.

అనాథలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలోని కస్పావీధిలో ఉంటున్న దివ్వల రత్నమ్మ, దండాసి దంపతులకు నలుగురు సంతానం. వారిలో ముగ్గురు కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. నాలుగో కుమారుడు సంతోష్ కూడా అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మృతి చెందారు. దీంతో గుండెలవిసేలా రోదిస్తున్నారు. గతంలో అనివార్య కారణాలతో పింఛనుకు నోచుకోక ఆర్థిక సమస్యలతో వృద్ధులు బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న సోషల్ రెస్పాన్స్‌బులిటీ ఆర్గనైజేషన్ సభ్యులు రూ.5 వేలు ఆర్థికసాయం నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఒ సభ్యులు తాతాజీ, జితేంద్ర, సంధ్యారాణి, ధనుష్ రంగ పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

104 సేవలు ప్రారంభం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ప్రభుత్వం పేదల కోసం గ్రామాల్లో 104 ద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తుందని, దీనిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోటబొమ్మాళి పంచాయతీ సర్పంచ్ కాళ్ల సంజీవరావు అన్నారు. కోటబొమ్మాళి మేజరు పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన 104 వైద్య సేవలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 104 వాహనంలో డాక్టర్‌తో పాటు అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా ప్రభుత్వం మందులు అందజేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆర్.యోగేశ్వరరావు, నాయకులు బోయిన కృష్ణారావు, ఇర్రి చిరంజీవి పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

జలుమూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... కోటబొమ్మాళి మండలం చిన్నతుంబయ్యపేట కాలనీకి చెందిన రావాడ లక్ష్మణరావు ఇంటి అవసరాల కోసం సిమెంట్ బస్తాలు కొనుగోలు చేసేందుకు స్కూటీపై చల్లవానిపేటలోని షాప్ వద్దకు వెళ్లాడు. ఈ సమయంలో శ్రీకాకుళం నుంచి పాతపట్నం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో లక్ష్మణరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఓ ప్రయివేట్ వాహనంలో నరసన్నపేట ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. క్షతగాత్రుని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి.పారినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నగదు, బంగారం చోరీ


గాయపడిన దుర్యోధన

మెళియాపుట్టి : మండలంలో దేగల పోలూరులో బుధవారం రాత్రి 8:30 ప్రాంతంలో దొంగలు బీభత్సం సృష్టించారు. సేనాపతి దుర్యోధన ఇంట్లోకి దొంగలు చొరబడి ఆయనను గాయపరిచి ఇంట్లో ఉన్న ఆరు తులాల బంగారం, రూ.5 వేలు నగదు దోచుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని వసుంధర సచివాలయం పరిధిలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికే చెల్లుతుందన్నారు. అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, వైసిపి మండల కన్వీనర్ పల్లి యోగి, జెడ్‌పిటిసి జి.ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఊర్లన బాలరాజు, సర్పంచ్ సలాన అప్పలనాయుడు, ఎంపిటిసి సలాన చిట్టి పాల్గొన్నారు.


రామకృష్ణను సన్మానిస్తున్న గ్రామస్తులు

గ్రంథాలయ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- పలాస

గ్రంథాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, గ్రంథాలయానికి కంప్యూటర్ బహుకరిస్తానని హైదరాబాద్ ఎక్సైజ్ సిఐ, ఉద్దాన విద్యాభివృద్ధి వేదిక గౌరవ సలహాదారులు దున్న రామకృష్ణ అన్నారు. మండలంలోని నీలావతిలో ఉద్దాన విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యాన చేపట్టిన గ్రంథాలయాన్ని బుధవారం సందర్శించారు. అనంతరం అండమాన్‌లో నివాసముంటున్న చిన్న మాకనపల్లివాసి జుత్తు పురుషోత్తం, భువనేశ్వర్‌లో నివాసం ఉంటున్న చిన్న మాకనపల్లి వాసి మల్లేన జీవనరావుతో పాటు రామకృష్ణకు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయాన్ని ఒక విజ్ఞాన కేంద్రంగా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో యువివి అధ్యక్షులు ఇసాకోటి జోగారావు, ప్రధాన కార్యదర్శి బొడ్డు చిన్నారావు, గౌరవ అధ్యక్షులు బి.ఓంకార్, రెయ్యి కృష్ణారావు, కుత్తుం ప్రకాశరావు, తెప్పల వాసుదేవరావు, కుత్తుం సుధాకర్, జినగ సీతారాం, తంగుడు ఖగేష్, కుత్తుం ప్రసాద్, మాడియ వాసు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి దాసు

ధాన్యం సేకరణ వేగవంతం

సోంపేట: రైతుల నుంచి ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని ఎంపిపి డాక్టర్ దాసు అధికారులను కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం సేకరణకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. ఎఒ నరసింహమూర్తి మాట్లాడుతూ ఇప్పటివరకు 23 రైతు భరోసా కేంద్రాల ద్వారా 1425 మంది రైతుల నుంచి 5172 టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. అలాగే 50 శాతం వరకు నగదు చెల్లింపులు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమేష్ కుమార్, డిటి కూర్మారావు, నారాయణరావు, ప్రియాంక, సత్యం పాల్గొన్నారు.

ఎంపిపి పరామర్శ

కంచిలి: మండలంలోని పలువురు వైసిపి సానుభూతిపరులు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపిపి దేవదాస్‌రెడ్డి, నాయకులతో కలిసి బుధవారం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. జి.శాసనంకు చెందిన వైస్ సర్పంచ్ కుమారస్వామి మేనల్లుడు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే బూరగాంకు చెందిన కిమోజు మనమ్మ మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు వజ్జ మృత్యుంజయం, పిఎసిఎస్ అధ్యక్షులు గుమ్మడి రామదాసు, నాయకులు వెంకటరావు, కృష్ణారావు, మాధవరావు, భీమారావు, చిన్నారావు, మన్మథరావు, లింగరాజు పాల్గొన్నారు.